## నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జడ్సీ అపూర్వ చౌహాన్ కోరారు. నేడు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి యథావిధిగా ప్రారంభమవుతుందని, ప్రజలు స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించుకోవాలని జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు గంగాధర్, వంశీకృష్ణ కోరారు.

## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి ( కేపీహెచ్‌బీ కాలనీ ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు ( కేజీ –రూపాయలు ). టమాట 15, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 35, కాకర 35, బీర 45, క్యాబేజీ 13, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 31, కాలీఫ్లవర్ 23, దొండ 18, చిక్కుడు 65, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలు 24, కీర 23, దోస 15, సోర 12, పొట్లకాయ 13, కంద 35, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 18, మామిడికాయ (1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామగడ్డ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 26, గుమ్మడి 25, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9:30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

బోడుప్పల్ : బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. బోడుప్పల్ ప్రధాన కేంద్రంగా ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి జ్ఞాన మాలను సమర్పించి నివాళులర్పించారు. 327 ఆదివారాలుగా కొనసాగుతున్న జ్ఞానమాల సమర్పణ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తున్నాం

**బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



వీనస్‌రాక్స్ హైట్స్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, మే 25 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కాలనీలు, బస్తీలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని వీనస్ రాక్స్ హైట్స్‌లో రూ. 36.80 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే వివేకానంద్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించామని, రానున్న రోజుల్లో కూడా అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ బాయ్, చెట్ల వెంకటేశ్, తెలంగాణ సాయి, చిన్నా చౌదరి, సమ్మయ్య యాదవ్, బాబీ చౌదరి, దూలప్ప, శివా నాయక్, జునైద్, ఆసిఫ్, ప్రసాద్, వీనస్ రాక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వీసీ. వేమా రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్ రెడ్డి, సలహాదారులు శివరాం ప్రసాద్, శంకర్ రెడ్డి, మధు, సంయుక్త కార్యదర్శి బాల నాగ దుర్గా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మత్స్య సహకార సంఘం అభివృద్ధికి సహకారం



మత్స్య సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్ : మత్స్య సహకార సంఘం అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. ఆదివారం 132 – జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని ఎఫ్‌సీఎస్ కన్వెన్షన్‌లో నిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, జీడిమెట్ల శాఖ 5వ సర్వసభ్య సమావేశానికి బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువులకు జీవం పోస్తూ మత్స్యకార వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ఆర్థికాభివృద్ధిని అందించి, మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి కృషిచేసిన గొప్ప నాయకుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ ఫిషరీస్ కో– అపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డిస్ట్రిక్ ఫిషరీస్ ఆఫీసర్ సుకీర్తి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జీడిమెట్ల శాఖ అధ్యక్షుడు చిలుకూరి కృష్ణ, ఉపాధ్యక్షురాలు చిలుకూరి యాదమ్మ, ప్రధాన కార్యదర్శి మద్దూరి వీరేశ్, డైరెక్టర్లు తాళ్ల వెంకటేశ్, మన్నె శంకర్, అరికల లక్ష్మణ్, మద్దూరి సత్తెమ్మ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం



వరద నీటి కాలువ పనులపై అధికారులు, కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్, మే 25 : ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపడుతున్నట్లు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరద కాలువల నిర్మాణంతో పటేల్ చెరువుకు అనుసంధానించి ఉపశమనం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పటేల్ కుంట చెరువు సమీపంలో నూతనంగా నిర్మించబోయే కాలువ నిర్మాణ పనులపై అధికారులు, కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఇప్పటికే వరద నీటి కాలువల నిర్మాణాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. తద్వారా మురుగునీరు చెరువులలోకి చేరకుండా నివారించి, వర్షపు నీటితో చెరువులు కళకళ లాడేలా చర్యలు చేపడతామన్నారు. వర్షాకాలంలోగా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వీటిని అందుబాటులోకి తేవాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సంతోష్, పావని, కాలనీవాసులు రాము, చైతన్య, వెంకటేశ్వర్లు , రాధాకృష్ణ పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం



పణీత్ ఫ్లోరా కాలనీ వాసులతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, మే 25 : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్ పల్లిలోని ప్రణీత్ ఫ్లోరా కాలనీ వాసుల ఆహ్వానం మేరకు కాలనీలో ఎమెల్సీ ఆదివారం పర్యటించారు. స్థానికుల ద్వారా కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ భరత్ కుమార్, కాలనీ ప్రెసిడెంట్ నాగమణి, వైస్ ప్రెసిడెంట్ హరీశ్, సభ్యులు పెద్దినేని, నాగరాజు , కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



కేపీహెచ్‌బీ కాలనీ, మే 25 : కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్‌పటేల్ నగర్ లోని శ్రీలక్ష్మీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దశమ వార్షికోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ఆదివారం మోహిని అలంకరణతో పల్లకీ ఉత్సవం, ఊరేగింపు, గరుడ వాహనసేవ, ఊరేగింపు జరిగాయి. వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని పూజలు చేశారు. స్వామి వారి కృపతో ప్రజలందరూ చల్లగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు . కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎం. కృష్ణారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



దుండిగల్, మే 25 : సీఎం సహాయనిధి పథకంతో పేదలకు మేలు జరుగుతుందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్ నగర్‌లోని తన నివాసంలో కూన శ్రీశైలం గౌడ్ ముప్పిడి సమ్మయ్యకు రూ.60 వేలు, బొట్టు లతకు రూ.60 వేలు, గౌరబోయిన రాజమ్మకు రూ.28,500 సీఎంఆర్ఆఫ్ చెక్కులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళ సంఘాలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీల మేఘ శ్యామ నృత్యరూపకం



ప్రశంసాపత్రాలు అందుకున్న నృత్యకళాకారులు

రవీంద్రభారతి, మే 25: ప్రముఖ కూచిపూడి నృత్యకళా సంస్థ సుమధుర ఆర్ట్స్ అకాడమీ సమర్పణలో గురు శ్రవ్యమానస ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుక సందర్భంగా 200 మంది విద్యార్థులు ప్రదర్శించిన నీల మేఘశ్యామ నృత్యరూపకం ఆకట్టుకున్నది. ఆదివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నృత్య రూపక ప్రదర్శన జరిగింది. కృష్ణ భగవానుని లీలామృతంలోని కొన్ని ముఖ్యఘట్టాలను గురు శ్రవ్యమానస భోగిరెడ్డి తన శిష్యబృందంతో అద్భుతంగా రూపకల్పన చేశారు. శిల్పారామం ప్రత్యేక అధికారి, రిటైర్డ్ ఐఏస్ జి.కిషన్‌రావు,స్టేట్ ఆర్ట్ గ్యాలరీ మేనేజర్ డైరెక్టర్ కె.లక్ష్మి ఐఏఎస్, ప్రముఖ సినీ టీవీ దర్శక నిర్మాతలు, నటీనలు పాల్గొని కళాకారులందరినీ తమ అభినందనతో ఆశీర్వదించారు. గురు శ్రవ్య మానసనని, తన శిష్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

వక్తలు మాట్లాడుతూ.. కూచిపూడి మన పూర్వీకులు ప్రసాదించిన వరప్రసాదమన్నారు. భావితరాలకు నాట్యగురువులు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. భోగిరెడ్డిని అభినందించారు.సంస్థ పక్షాన గురు శ్రావ్య మానస అతిథులందరినీఉచిత రీతిన సన్మానించారు. గురు,శ్రవ్య మానస వందన సమర్పణతో నీలమేఘవ్యామ ప్రదర్శన ముగిసింది.



రామంతాపూర్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గురువు పావని శ్రీలతప్రసాద్ శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. రంగ పూజ, విన్నపాలు, పుష్పాంజలి, ఇదిగో భద్రాద్రి, శాంకరి శంకరుడు, నమశ్శివాయ, హిమగిరి, రామాయణ శబ్దం అంశాలను విముక్త, సుహాని, నిధ్విక, శాన్వి, చైత్ర, జెశ్విత, దేవి లత, మాధవి, ఆధ్య, తరుణి, అడవిత, సమన్విత, హంసిని ప్రదర్శించారు.

## వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, మే 25 : ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా, హవేలీ ఘన్‌పూర్ మండలం, బూరుగుపల్లికి చెందిన మారెల్లి ప్రభాకర్ (38) కుటుంబ సభ్యులతో నగరానికి వచ్చి గుండ్లపోచంపల్లిలోని లక్ష్మీనగర్ కాలనీలో ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం వెల్లదిస్తున్నారు. ప్రభాకర్ కొన్నిరోజుల నుంచి మద్యం సేవించి ఇంట్లో భార్యాపిల్లలతో గొడవలకు దిగుతున్నాడు. ఈ విషయంపై భార్య కుటుంబసభ్యులు ఈ నెల 23న వచ్చి పలుకరించగా మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

శేరిలింగంపల్లి : అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన రాయదుర్గం పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఏపీ, విజయనగరం జిల్లా, ప్రసాద్‌నగర్‌కు చెందిన లంక హర్షవర్ధన్ (26) వారసిగూడలో ఉంటున్నాడు. సికింద్రాబాద్‌లోని ఓ ఏసీ కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తోటి ఉద్యోగులు, స్నేహితులతో కొండాపూర్‌లోని ఓ పబ్‌లో పార్టీ చేసుకున్నారు. అర్ధరాత్రి పబ్ నుంచి గచ్చిబౌలిలోని మిత్రుల ఫ్లాట్‌కు వెళ్లి అక్కడ మళ్లీ మద్యం సేవించారు. ఆదివారం తెల్లవారు జామున 4:30 గంటల సమయంలో హర్షవర్ధన్ వాంతులు చేసుకోవడంతో స్నేహితులు ఏఐజీ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ ఉదయం 9 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాయదుర్గం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పింఛన్ పెంచాలి

అంబర్‌పేట : స్టేట్ బ్యాంక్ అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. అసోసియేషన్ ప్రతినిధి సుధాకర్ అధ్యక్షతన 1995 నుండి పింఛన్ పెంపు, బీమా సౌకర్యం అంశాలపై చర్చించారు. కేంద్రం ఈ విషయాలపై స్పందించాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రధాన కార్యదర్శి సి.ఎన్. ప్రసాద్, అధ్యక్షుడు డా.అనంతకృష్ణ, సంయుక్త ప్రధాన కార్యదర్శి వి.సోంబాబు మాట్లాడారు.

# జూ పార్క్‌కు పోటెత్తిన సందర్శకులు



జంతు ప్రదర్శన శాల (జూ పార్క్) ఆదివారం సందర్శకులతో కళ కళ లాడింది. వేసవి సెలవులు కావడంతో ఆహ్లాదపు వాతావరణాన్ని ఆస్వాదించడానికి భారీగా సందర్శకులు జూపార్క్‌నకు తరలివచ్చారని అధికారులు తెలిపారు. దీనితో జూ లోని జంతువుల ఎంక్లోజర్లు పర్యాటకులతో నిండిపోయాయి. ఆదివారం 24వేల పైచిలుకు పర్యాటకులు జూ ను సందర్శించారని అధికారులు తెలిపారు.

- చార్మినార్



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఓయాసిస్ అపార్ట్‌మెంట్ నుంచి శ్రీ ఎన్‌క్లేవ్,లోనేట విల్లాస్,కావూరిహిల్స్ కాలనీలకు వెళ్లే దారిలో డ్రైనేజీలు పొంగుతున్నాయి. అధికారులు స్పందించి డ్రైనేజీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

- బండ్లగూడ

# క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



జిల్లాస్థాయి పోటీలకు హాజరైన విద్యార్థులు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

శామీర్‌పేట, మే 25: శామీర్‌పేట తెలంగాణ క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం జరిగాయి. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 8, 10, 12 ఏండ్లలోపు బాల బాలికలు పాల్గొని పరుగు పందెం, షాట్ పుట్, జావెలిన్‌త్రో, లాంగ్ జంప్ తదితర పోటీల్లో తలపడ్డారు. ఈ సందర్భంగా కూరపాటి రాజశేఖర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి పోటీల్లోప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జూన్ మొదటి తారీకున హైదరాబాద్‌లో జరిగే 14వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ దయాళ్, టెక్నికల్ కమిటీ సభ్యుడు తిరుమలరావు, వివిధ పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జోరుగా అక్రమ నిర్మాణాలు

**పోచారం మున్సిపాలిటీలో కిందిస్థాయి సిబ్బంది చేతివాటం.. పట్టించుకోని అధికారులు**

పోచారం, మే 25: పోచారం మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నది. కిందిస్థాయి సిబ్బంది చేతివాటం, అధికారులు పర్యవేక్షణ లేని కారణంగా అక్రమ నిర్మాణ దారులు జోరు పెంచారు. కొంత మంది నిర్మాణ దారులు మున్సిపాలిటీ నుంచి భవనాల నిర్మాణం కోసం జీ ప్లస్–2 అనుమతి తీసుకొని ఐదు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మాణాలు జరుపుతున్నారు. మరికొంత మంది నిర్మాణదారులు అప్పట్లో ఉన్న ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో ఉండి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో మున్సిపాలిటీకి చెందిన టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపాలిటీ అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతుందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇన్ఫోసెస్ ప్రాంతంలో, అన్నోజిగూడ, చౌదరిగూడ, నారపల్లి, పోచారం, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యాంనంపేట్ వెంకటాపురం, కాచివానిసింగారం, జోడిమెట్ల, వరంగల్ ప్రధాన రహదారికి ఇరువైపులా ఈ అక్రమ నిర్మాణాలు జోరుగా వెలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాల కారణంగా భవిష్యత్‌లో మౌలిక వసతుల కల్పనలో మున్సిపాలిటీకి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉన్నా అధికారులు ఎందుకు ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోచారం మున్సిపాలిటీలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

## ముగిసిన ప్రణవ భక్తసమాజం శతాబ్ది ఉత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి : అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో ప్రణవ భక్త సమాజం ఏకశత పంచోత్తర మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం పూర్ణాహుతి, గణపతి సహిత రుద్రహోమం, ప్రవచనాలు నిర్వహించారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. నిత్యాన్నదానంలో భక్తులు పాల్గొన్నారు. చివరి రోజు ఆదివారం పరిశుద్ధానందగిరి స్వామి, శంకరానందగిరి స్వామి, వీరానంద బ్రహ్మచారి దివ్య ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమాజం అధ్యక్షులు మోండ్ర నర్సింహ, పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, కొండమీది హరినాథ్, ఎస్.బి.హరినాథ్, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, కొలన్ సుభాష్‌రెడ్డి, మ్యాడం రామేశ్వర్‌రావు, మోండ్ర కొమురయ్య, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ పాల్గొన్నారు.